
పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455


శ్రీశ్రీశ్రీ సంజీవరాయస్వామి ఆలయం
సఖియా మఠం, బాయమ్మతోట, చిన బొందిలీపురం, శ్రీకాకుళం
ఆహ్వానం
శనిత్రయోదశి
తేది 17-08-2024 శనివారం
ఈ ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించబడిన జిల్లాలోనే అరుదైన 3 అడుగులు ఎత్తుగల శ్రీశనైశ్చర విగ్రహానికి మీ స్వహస్తాలతో ప్రప్రథమ తైలాభిషేకం
(ఉదయం : 5 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు)
చేయుటకు తరలిరండి. దర్శించి తరించండి.
ఆలయంలోపల గల శ్రీ శనైశ్చరుని సన్నిధి.
ఈ నెలలోనే 2వ శనిత్రయోదశి: తేది 31-8-2024 శనివారం కూడా ఈ విధంగా జరుగును.
- ఆలయ ధర్మకర్త.
- విశ్వజయము గ్రూప్ భక్త బృందం సౌజన్యంతో
సెల్: 92466 31755

TET - సైకాలజీ, తెలుగు ఇంగ్లీష్
DSC - SGT, SA - సోషల్, తెలుగు, బయాలజీ
సోషల్ మెథడ్స్- ఉపేంద్రనాయుడు సార్ - జూలై 7th
సైకాలజీ, ట్రైమెథడ్స్, PIE- సైదులు సార్ - జూలై 12,13,14
రైల్వే(RRB)/SSC/కానిస్టేబుల్స్/SI/BANK
RPF AP
స్పెషల్ బ్యాచ్: అర్థమెటిక్, రీజనింగ్, ప్యూర్ మేథ్స్ 'చలం' రవి, M.వేణుగోపాల్, మల్లిక్, Ch.శంకర్, కృష్ణమూర్తి, Sirsచే
9AM - 7PM సెమినార్, 10 రోజులు ఫ్రీ డెమో క్లాసులు
SOLVE ACADEMY
పౌర గ్రంథాలయం, వైజాగ్-16 | RTC కాంప్లెక్స్, శ్రీకాకుళం
7569089825, 8688172010




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

గురువారం 15-8-2024

సంపుటి: 20 సంచిక: 122
పేజీలు: 4 వెల: రూ.1





• ఎడిటోరియల్

# పడిపోతున్న పన్ను ఆదాయం!

ఎన్నో హామీలు ఇచ్చాం.. రాష్ట్ర ప్రజలకు ఎంతో చేయాలని ఉంది. కానీ ఆర్థిక పరిస్థితి చూస్తే భయమేస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకే.. ప్రజలను మానసికంగా సిద్ధం చేసేందుకే ముఖ్యమంత్రి ఇలా మాట్లాడుతున్నారని అధికశాతం ప్రజలు అభిప్రాయపడ్డారు. ఇక తాజాగా చంద్రబాబు మరో ప్రకటన చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు గతంలో తమ ప్రభుత్వం నిర్వహించిన అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్వాతంత్ర్య దినోత్సవం నాడు రాష్ట్రవ్యాప్తంగా వంద అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. వీటి నిర్వహణకు ప్రజలు, దాతలు ఉదారంగా విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. క్యాంటీన్లు ప్రారంభించడంతో వాటి నిర్వహణకు కచ్చితంగా నిధులు కేటాయించాల్సి వస్తుంది. ఇది ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ఖజానాకు భారమే. ఈ భారాన్ని కొంతలో కొంతైనా తగ్గించుకోవాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఈ రకమైన పిలుపునిచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితికి కారణమేంటని అడిగితే ప్రభుత్వ పెద్దలతో సహా అందరూ సంక్షేమ పథకాలకు భారీగా నిధులు ఖర్చవుతుండటమేనని చెబుతారు. కానీ ఇదొక్కటే కారణం కాదు. ఇది నాణానికి ఒకవైపు చిత్రం మాత్రమేనని చెప్పాలి. మరో పార్శ్వం పరిశీలిస్తే ఆందోళన కలుగుతుంది. రాష్ట్రానికి పన్ను ఆదాయం తగ్గిపోతుండటమే ఈ ఆందోళనకు కారణం. సాధారణంగా పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఏడాదికేడాది పెరుగుతుంటుంది. జనాభా పెరుగుతున్న క్రమంలో పన్ను చెల్లింపుదారులు కూడా పెరగడం సహజం. దీన్ని దృష్టిలో ఉంచుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా పన్ను వసూళ్ల, ఆదాయ లక్ష్యాలను పెంచుతుంటాయి. కానీ చిత్రంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం వివిధ రకాల పన్ను ఆదాయం తగ్గుతోంది. విధానపరమైన లోపాలతో పాటు పన్ను ఎగవేతలు భారీగా పెరగడమే ఈ పరిస్థితికి కారణం. రాష్ట్ర విభజన తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ ఆదాయం తగ్గిపోయింది. 2014-19 మధ్య అంతంతమాత్రంగా ఉన్న ఆదాయం.. ఆ తర్వాతైనా పెరగకపోగా మరింత తగ్గిపోతూ వస్తోంది. వస్తుసేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత చాలా రకాల పన్నులు అందులో కలిసిపోయాయి. ఈ పన్ను ఆదాయాన్ని కూడా కేంద్రం తీసుకుని.. అందులో రాష్ట్రాలకు వాటా ఇస్తుంది. మరో సమస్య ఏమిటంటే.. జీఎస్టీ రూపంలో ప్రజల చెల్లిస్తున్నదానికి.. ప్రభుత్వానికి చేరుతున్న ఆదాయానికి మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. పన్ను వసూళ్లను పర్యవేక్షించే అధికారుల్లో చాలా మంది చేతివాటం ప్రదర్శించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. జీఎస్టీ అమల్లో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యలో వ్యాపారులు ఉంటారు. వ్యాపార లావాదేవీలు నిర్వహించే సమయంలోనే ప్రజల నుంచి వ్యాపారులు పన్ను వసూలు చేస్తారు. తర్వాత దాన్ని ప్రభుత్వానికి బదలాయించాల్సి ఉంటుంది. ఇదంతా సక్రమంగా జరిగేలా అధికార వ్యవస్థ పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఈ వ్యవస్థ గాడి తప్పడంతో ప్రభుత్వాన్ని చేరాల్సిన పన్ను ఆదాయం దారి తప్పుతోంది. ఆ మేరకు రాష్ట్రాలకు రావాల్సిన జీఎస్టీ వాటాలో కోత పడుతోంది. జీఎస్టీ ఎగవేతలపై పెద్దసంఖ్యలో కేసులు కూడా నమోదైనా అవి సుదీర్ఘకాలంగా పెండింగులో ఉండిపోతున్నాయి. మరోవైపు రాష్ట్రాల ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన అమ్మకపు పన్ను(సేల్స్ ట్యాక్స్) ఆదాయం కూడా ఏపీలో గణనీయంగా తగ్గిపోతోంది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ విక్రయాలకు సంబంధించే గత ఐదేళ్లలో సుమారు రూ.3,500 కోట్ల ఆదాయం తగ్గిపోయిందని అంచనా. దీనికి కారణం.. మన రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌పై ఇతర రాష్ట్రాల కంటే సుంకాలు అధికంగా ఉండటమే. మన రాష్ట్ర సరిహద్దులోని తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో తక్కువ పన్నులు ఉండటం వల్ల పెట్రోల్, డీజిల్ రేట్లు మన రాష్ట్రంతో పోలిస్తే తక్కువగా ఉంటున్నాయి. దీంతో ఈ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న మన రాష్ట్రానికి చెందినవారు ఆ ప్రాంతాలకు వెళ్లి కొనుగోళ్లు జరుపుతున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో మన రాష్ట్ర సేల్స్ ట్యాక్స్ ఆదాయం రూ.22వేల కోట్లు ఉంటే 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి అది రూ.18,500 కోట్లకు పడిపోయింది. అంటే ఐదేళ్లలో రూ.3500 కోట్ల పన్ను ఆదాయం కోల్పోయామన్న మాట. అదే సమయంలో మన దాయాది రాష్ట్రమైన తెలంగాణ సేల్స్ ట్యాక్స్ ఆదాయం అదే ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. 2018-19లో ఆ రాష్ట్ర సేల్స్ ట్యాక్స్ వసూళ్లు రూ.19వేల కోట్లుగా ఉంటే, 2023-24 నాటికి రూ.10వేల కోట్లు పెరిగి రూ.29వేల కోట్లకు ఎగబాకాయి. అదేవిధంగా మన రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా గత ఐదేళ్లలో గణనీయంగా తగ్గిపోయినట్లు ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇవన్నీ విధానపరమైన లోపాల వల్ల జరుగుతున్న అనర్థాలే. పన్ను ఆదాయం పెరిగితే తప్ప అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించే పరిస్థితి ఉండదు. ఖజానా ఖాళీగా ఉంటే అప్పులపైనే ఆధారపడాల్సి వస్తుంది. అప్పుల వల్ల వడ్డీల భారం పెరిగిపోతుంది. ఆదాయంలో సింహభాగం వడ్డీలకే వెళ్లిపోతుంది. ఈ గడ్డు పరిస్థితుల నుంచి బయటపడాలంటే రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలుచేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పారు. అదాని సంగతెలా ఉన్నా ముందు వ్యవస్థాపరమైన లోపాలు సవరించి పన్ను ఆదాయం పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

## డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

వప్పంగి గ్రామ పంచాయతీలో వప్పంగి, శ్యాంపాలెం గ్రామాలకు చెందిన చెత్తను, చికెన్ షాపుల వ్యర్థాలను వప్పంగి పెద్ద చెరువు గట్టు మీద, పంట కాలువ గెడ్డ మీద డంప్ చేస్తున్నారని, దీనివలన చెరువులో నీరు కలుషితం అవుతుందని, డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు, మండల నాయకులు భైరి అప్పారావు, చిట్టి తవుడు, ఎచ్చెర్ల నాగరాజు కోరారు. ఈమేరకు గురువారం ఆ పరిసరాలను పరిశీలించారు. సాగునీరు కాలువ పూడుకుపోతుందని, మాంసం వ్యర్థాలను తినడానికి వస్తున్న కుక్కలు దారిలో వెళుతున్న విద్యార్థులు, పిల్లలపై దాడి చేసి గాయపరుస్తున్నాయని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించినట్టు తెలిపారు. వెంటనే జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి, గ్రామ పరిధిలో తగిన స్థలం డంపింగ్ యార్డుకు కేటాయించాలని, ఇక్కడి చెత్తను వెంటనే తొలగించాలని వెంకటేశ్వరరావు కోరారు.



## ఎల్టీపీ వైస్‌ప్రెసిడెంట్‌గా ముని

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్‌కి శ్రీకాకుళం జిల్లా నుంచి వైస్ ప్రెసిడెంట్‌గా ముని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. తిరుపతిలో ఈ నెల 13, 14 తేదీల్లో రాష్ట్ర ఎల్టీపీ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో జిల్లా నుంచి శ్రీనివాసరావు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, ఈసీ మెంబర్‌గా బూరులే సత్యనారాయణ ఎన్నికయ్యారు. జిల్లా, జోన్-1 నుంచి ఎల్టీపీల సమస్యలను రాష్ట్ర అసోసియేషన్ దృష్టికి తీసుకువెళ్లి ఎల్టిపీ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి వారి అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వివిధ సంఘాల నేతలు అభినందించారు.



## చేపలవీధి సచివాలయంలో జెండావందనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

17, 18 డివిజన్ల పరిధి చేపలవీధి సచివాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో పతాకావిష్కరణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జిలు చవిటిపల్లి గోవిందరావు, బస్వా రాజేష్‌రెడ్డి, సచివాలయ అడ్మిన్ అల్తి సంజీవరావు, సిబ్బంది ఎస్.దివ్య, టి.జయశ్రీ, బి.నాగమణి, ఎస్.దినేష్, కెవెల్ రత్నకుమారి, వార్డు సభ్యులు జి.కృష్ణారావు, సత్యనారాయణ, ఎ.నీలయ్య, శశిభూషణ్, కరాటే శ్రీనులు పాల్గొన్నారు.





స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, జెండా వందనం చేసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



### జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జాతీయ పతాకాన్ని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆవిష్కరించారు. ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీ ఎల్.శేషాద్రి, పరిపాలన అధికారి సీహెచ్ గోపినాథ్, ఇతర పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న శ్రీకాకుళం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్

## కస్తూరిబా పాఠశాలలో..

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



మురపాక కస్తూరిబా పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను వివరించగా, త్వరలో పరిష్కరిసానని ప్రకటించారు. ఇక్కడ చదువుతున్నవారు బాలికలు కాబట్టి విద్యుత్ కోత వల్ల ఇబ్బంది పడకుండా ఇన్వెర్టర్ మంజూరు చేస్తానని ప్రకటించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు హర్షం తెలిపారు. అనం తరం అల్లినగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెండా వంద నం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

## లావేరు శాఖాగ్రంథాలయంలో..

(సత్యంన్యూస్, లావేరు)

స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల జీవిత చరిత్రల గురించి విద్యార్థులకు తెలిపారు. వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయం తరపున బహుమతుల అందజేశారు. తొలుత విద్యార్థులతో ఇండిపెండెన్స్ డే ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ జె.రమేష్, గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.






# మసాలా పట్టలేదు!

వేరే భాషల నుంచి కథలు అరువు తెచ్చుకున్నా.. వాటికి తనదైన టచ్ ఇచ్చి మంచి కమర్షియల్ సినిమాలుగా మలిచే దర్శకుడు హరీష్ శంకర్. 'దబంగ్'ను 'గబ్బర్‌సింగ్'గా.. 'జిగర్‌తండ'ను 'గద్దలకొండ గణేష్'గా అతను మలిచిన తీరు ప్రశంసలందుకుంది. ఇప్పుడు హిందీ హిట్ 'రైడ్'ను తెలుగులో 'మిస్టర్ బచ్చన్' పేరుతో రీమేక్ కాని రీమేక్ చేశారు హరీష్. రవితేజ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి హరీష్ మరోసారి మెప్పించాడా.. చూద్దాం పదండి.

### కథ:

80వ దశకంలో ఆదాయపు పన్ను అధికారిగా 70కి పైగా రైడ్స్ చేసి మంచి పేరు సంపాదిస్తాడు బచ్చన్ (రవితేజ). అతడి అసలు పేరు ఆనంద్ అయినప్పటికీ.. 'షోలే' సినిమాతో అమితాబ్ బచ్చన్ వీరాభిమానిగా మారిన తన తండ్రి బచ్చన్ అని పేరు మార్చేస్తాడు. ఆ పేరుతోనే అతను పాపులర్ అవుతాడు. ఐతే ఒక ఐటీ రైడ్ తర్వాత అనూహ్య పరిణామాల మధ్య అతను సస్పెండ్ అవుతాడు. దీంతో తన ఊరికి వచ్చేసి ఒకప్పటి వ్యాపకమైన ఆర్కెస్ట్రాలో సింగర్‌గా కొనసాగుతుంటాడు. ఈ క్రమంలోనే తన ఊరికే చెందిన జిక్కి (భాగ్యశ్రీ బోర్సే)తో ప్రేమలో పడతాడు. నెమ్మదిగా జిక్కి కూడా బచ్చన్ ను ప్రేమిస్తుంది. వీళ్లిద్దరి పెళ్లికి రంగం సిద్ధమవుతున్న తరుణంలో బచ్చన్ మీద సస్పెన్షన్ ఎత్తేసిన ప్రభుత్వం.. అతణ్ని ముత్యం జగ్గయ్య (జగపతిబాబు) అనే పవర్ ఫుల్ పొలిటీషియన్ ఇంటి మీదికి ఐటీ రైడ్ కు పంపిస్తుంది. అప్పటికే జగ్గయ్య తమ్ముడితో వైరం పెట్టుకున్న బచ్చన్.. రైడ్ కు వెళ్లాక అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. వాటన్నింటినీ అతనెలా అధిగమించాడు.. మరోవైపు జిక్కితో తన పెళ్లి జరిగిందా లేదా అన్నది మిగతా కథ.

### కథనం-విశ్లేషణ:

అందరికీ అన్ని రుచులూ నచ్చవు. కొందరికి రుచి లేకపోయినా.. చప్పగా ఉన్నా సరే ఆరోగ్యకరమైన వంటకమే నచ్చుతుంది. కొందరేమో ఆ చప్పిడి కూడేం తింటాం.. ఆరోగ్యం సంగతి తర్వాత రుచే ముఖ్యం అంటారు. ఎవరి అభిరుచి వారిది. సినిమాను ఓ వంటకం భావిస్తే.. మనకు అంత రుచిగా అనిపించదు అనుకునే వేరే వాళ్ల వంటకానికి తనదైన శైలిలో మసాలా అద్ది దాన్ని మన వాళ్లకు రుచించేలా తయారు చేస్తాడని దర్శకుడు హరీష్ శంకర్‌కు పేరుంది. దబంగ్.. జిగర్ తండ లాంటి పరభాషా సినిమాలను అతను మన వాళ్లకు నచ్చేలా మార్చి మంచి మార్కులే కొట్టేశాడు. ఐతే దబంగ్.. జిగర్ తండ చిత్రాలను చెడగొట్టాడు అనే వాళ్లు కూడా లేకపోలేదు. కానీ ఆ సినిమాలు ఎక్కువమందికి నచ్చాయి. ఇప్పుడు అదే శైలిలో హరీష్ శంకర్ 'రైడ్'కు తెలుగు మసాలాలు అద్దడానికి ట్రై చేశాడు. కానీ ఈసారి అతను అద్దిన మసాలాలు ఆ వంటకానికి సరిగా పట్టలేదు. ఒరిజినల్ వంటకం రూపురేఖలు పూర్తిగా మారిపోయి.. కొత్తగా మసాలాలూ సరిగా కలవక.. టేస్టు సోసోగా తయారైంది.

రీమేక్ సినిమా అన్నాక మాతృకతో పోలికల గురించి మాట్లాడుకుండా ఉండలేం. అందులోనూ హరీష్ శంకర్ టైటిల్ క్రెడిట్స్‌లో 'మార్పులు' అని ప్రత్యేకంగా వేసుకుంటాడు కూడా. మరి ఆ మార్పులు ఎంతమేర పని చేశాయన్నదే తన రీమేక్ సినిమాల ఫలితాలను నిర్దేశిస్తాయి. ఈ సినిమాకు ఆధారమైన 'రైడ్' హరీష్ శంకర్ చెప్పినట్లే ఒక డాక్యుమెంటరీలాగే అనిపిస్తుంది. వాస్తవంగా జరిగిన ఘటనలనే ఆధారంగా చేసుకుని సాధ్యమైనంత వరకు రియలిస్టిగ్గా సినిమా తీశారు కొన్ని కామెడీ మెరుపులు.. కొత్త కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అందాన్ని ఎలివేట్ చేసే రొమాంటిక్ సీన్లు-పాటలు.. హీరో ఎలివేషన్లతో రొటీన్ కాలక్షేపమే అన్నమాట. ఈ అడిషన్ల వల్ల అసలు కథ పలుచన అయిపోయింది. హీరో పరిచయ సన్నివేశాలు బాగున్నాయి. హీరో ఫస్ట్ రైడ్ చూశాక సినిమాకు మూలమైన అసలు రైడ్ మీద అంచనాలు పెంచుకుంటాం. సత్య కామెడీ కూడా టైంపాస్ చేయిస్తుంది. కానీ కామెడీ డోస్ ఇంకొంచెం పెంచాల్సిందనిపిస్తుంది. మధ్యలో వచ్చే హీరో ఎలివేషన్ సీన్ కూడా బాగానే పండింది.

విలన్ తో హీరో ఫేసాఫ్ కు దారి తీసే రైడ్ దగ్గర ఇంటర్వెల్ బ్యాంగ్ వేయడం కూడా బాగుంది. కానీ ద్వితీయార్థం మాత్రం అంచనాలకు తగ్గట్లు సాగదు. తర్వాత ఏం జరుగుతుందనే క్యూరియాసిటీ లేకుండా ద్వితీయార్థం బోరింగ్‌గా తయారైంది. హీరోకు ఎదురే లేదన్నట్లు చూపించడం.. విలన్ నుంచి పెద్దగా ఛాలెంజే లేకపోవడంతో సినిమా ఏకపక్షంగా మారిపోయింది. సందర్భానుసారంగా పాటలు రావాలే కానీ.. ఇందులో పాటల కోసం సందర్భాలు సృష్టించిన దర్శకుడు వాటిని పెద్ద స్పీడ్ బ్రేకర్లలా మార్చే శాడు. సీరియస్‌గా రైడ్ చేస్తున్న హీరో మధ్య మధ్యలో పాటల కోసం బ్రేక్ తీసుకుని వెళ్లిరావడం చిరాకు పెట్టిస్తుంది. ఒక దశ దాటాక ఇంకెప్పుడు ముగిస్తారనే ఫ్రస్టేషన్ ప్రేక్షకుల్లో మొదలవుతుంది. పతాక సన్నివేశాలు కూడా మామూలుగా అనిపిస్తాయి. అంతకంటే ముందు సిద్ధు జొన్నలగడ్డ క్యామియోతో కొంత హుషారు పుట్టించాడు. కానీ సినిమాను మాత్రం పైకి లేవలేకపోయాడు. మొత్తంగా చూస్తే 'రైడ్'ను మన ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు చేసిన మార్పులు చేర్పులు జస్ట్ ఓకే అనిపించినా.. ఒరిజినల్లో ఉన్న ఆత్మ మిస్సవడం వల్ల 'మిస్టర్ బచ్చన్' జస్ట్ ఓకే సినిమాగా తయారైంది.

### నటీనటులు:

తన చివరి చిత్రాల్లో మాస్ రాజా రవితేజ అంత హుషారుగా కనిపించకపోవడం అభిమానులను నిరాశపరిచింది. ఐతే 'మిస్టర్ బచ్చన్'లో రవితేజను ఫుల్ ఎనర్జీతో చూడొచ్చు. తన అభిమానులకు ఫుల్ జోష్ ఇచ్చేలా రవితేజ కనిపించాడు. తన మార్కు అల్లరి.. హీరో ఎలివేషన్లు.. మాస్ డైలాగ్స్ ఉన్నాయి సినిమాలో. తన వరకు రవితేజ పూర్తిగా మెప్పించాడు. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సినిమాకు ఆకర్షణ అయింది. ఆమెను చాలా అందంగా.. సెక్సీగా చూపించాడు హరీష్ శంకర్. పాటల్లో భాగ్యశ్రీ మరింత ఆకర్షణీయంగా కనిపించింది. తన నటన పర్వాలేదు. సొంతంగా చెప్పుకున్న డబ్బింగ్ బాగుంది. విలన్ పాత్రలో జగపతిబాబు నిరాశపరిచాడు. ఆయన నటన.. హావభావాలు కృత్రిమంగా అనిపించాయి. ముఖ్యంగా మాతృకలో సౌరభ్ శుక్లా పాత్ర చూసిన వాళ్లు ఈ పాత్రను కాసేపు కూడా భరించలేరు. గెటప్ డిఫరెంటుగా ట్రై చేశారు కానీ.. ఆ పాత్రలో మాత్రం పెద్దగా వైవిధ్యం కనిపించదు. సత్య కామెడీ సినిమాలో పెద్ద రిలీఫ్. కనిపించిన ప్రతిసారీ నవ్వులు పూయించాడు. తన పాత్రను ఇంకా పెంచి ఉంటే బాగుండేదనిపిస్తుంది. సచిన్ ఖేద్కర్.. తనికెళ్ల భరణి.. మిగతా నటీనటులంతా ఓకే. సిద్ధు జొన్నలగడ్డ క్యామియో బాగుంది.

### సాంకేతిక వర్గం:

మిక్కీ జె మేయర్ తాను మాస్ సినిమాలకు సూటయ్యే సంగీతాన్నివ్వగలనని మరోసారి చాటాడు. పాటలు.. బ్యాగ్రౌండ్ స్కోర్ సూపర్ అనలేం కానీ.. సినిమాకు అవసరమైన స్థాయిలో సాగాయి. సితార్ సాంగ్ అన్నింట్లోకి ప్రత్యేకంగా అనిపిస్తాయి.. మిగతా పాటలు పర్వాలేదనిపిస్తాయి. నేపథ్య సంగీతం ఓకే. కెమెరామన్ అయానాంకా బోస్ విజువల్స్ కలర్‌ఫుల్‌గా సాగాయి. సినిమా విజువల్ గా బాగుంది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. ఇక దర్శకుడు హరీష్‌శంకర్ విషయానికి వస్తే.. రీమేక్ సినిమాలను మన నేటివిటీకి తగ్గట్లుగా మలచడంలో తన నైపుణ్యాన్ని అతను మరోసారి చూపించాడు. మార్పులు చేర్పుల్లో తన కృషి తెర మీద కనిపిస్తుంది. పూర్తిగా ఓ కొత్త సినిమా చూస్తున్న ఫీలింగ్ కలిగించాడు. కానీ కంటెంట్ పరంగా.. ఇంటెన్సిటీ విషయంలో మాతృకతో ఇది సరితూగదు. ఇది ఒక రీమేక్ అని మరిచిపోయి మామూలుగా చూస్తే అంత ఎంగేజింగ్‌గా అనిపించదు. అతను సరైన రీమేక్ ను ఎంచుకోలేదనే ఫీలింగ్ కలుగుతుంది. రచయితగా.. దర్శకుడిగా హరీష్ కష్టాన్ని తక్కువ చేయలేం. అదే సమయంలో అతను గొప్ప పనితనాన్నీ చూపించలేకపోయాడు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



కలెక్టర్ బంగ్లా రోడ్డులోని వివేకానంద విద్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వందన కిరణ్ హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ ప్రసాద్, డైరెక్టర్లు జి.విజయ్ కుమార్, ఎన్.డి.మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గేదెల శ్రీను, సోమేశ్ సహకారంతో రెండు వీల్ చైర్స్‌ను టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ తరఫున మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు చేతుల మీదుగా హాస్పిటల్ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో టెక్కలి మండల తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, టెక్కలి

## వేడుకగా జెండా పండగ ప్రదర్శన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా అధికారులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి 80 అడుగుల రోడ్డు మీదుగా ఆర్ & బీ బంగ్లా వరకు స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేసిన ఫలితమే నేటి మన స్వాతంత్ర్యమన్నారు. దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తూ జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం పట్ల అధికారులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, మహిళలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌లో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ నినాదానికి మనమంతా కట్టుబడి ఉండాలని లయన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. గురువారం నటుకుల వారి వీధిలో లయన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం కార్యాలయ ప్రాంగణంలో త్రివర్ణ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, డాక్టర్ బాడాన దేవభూషణరావుల సహకారంతో నిరంతర సేవలకు శ్రీకారం చుట్టామని, ట్రెజరర్ జోగి భారతి, ఇతర లయన్స్ సభ్యులతో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు టెక్కం రాంగోపాల్, శిల్లా మణి, ఈశ్వరరావు, ఉర్లం శివతేజ, డాక్టర్ పైడి ప్రదీప్, పొదుగు చరణ్ కామేష్, నరేష్, తిరుమలరావు, కోరాడ హరగోపాల్, పాలిశెట్టి మల్లిబాబు పాల్గొన్నారు.





స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈశ్వర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్పు విజయ్ సారథ్యంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు నరసన్నపేట కాళింగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉప్పాడ పూర్ణారావు, కమిటీ సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

– సత్యంన్యూస్, నరసన్నపేట

## పౌరులందరూ జాతీయ భావం కలిగివుండాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

పౌరులందరూ దేశభక్తి, జాతీయ భావంతో మెలిగి భారతదేశ సమగ్ర సౌభ్రాతృత్వాన్ని చాటాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే శంకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలమే ఈ స్వాతంత్ర్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేషు, వార్డు ఇన్‌ఛార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం ఏర్పాటుచేసిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఆయనతో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పాల్గొని గౌరవ వందనం చేశారు. మైదానంలో పోలీసులు, హోం గార్డులు, ఎన్‌సీసీ కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం లయోలాకు చెందిన 30 మంది విద్యార్థులతో బాలలము మేము ప్రదర్శన, పీఎన్ కాలనీ సాయినాథ్ విద్యామందిర్ 55 మంది విద్యార్థులతో జయహో జయహో భారత్ ప్రదర్శన, టంగుటూరి ప్రకాశం పంతులు మునిసిపల్ హైస్కూల్ 40 మంది విద్యార్థులతో సిక్కోలు వైభవం నృత్య రూపకం, పీఎన్ కాలనీ న్యూ సెంట్రల్ స్కూల్ 50మంది విద్యార్థులచే వందేమాతరం ప్రదర్శన, కేజీబీవీ గార 75మంది విద్యార్థులతో ఎలుగెత్తి పాడరా వందేమా తరం, ఐటీడీఏ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ 10 మంది విద్యార్థులచే ట్రైబల్ ఫోక్ డాన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రసంసా పత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో న్యూ సెంట్రల్ స్కూల్‌కు మొదటి బహుమతి, కేజీబీవీ గారకు రెండవ బహుమతి, ఐటీడీఏ తృతీయ స్థానం, శకటాల ప్రదర్శనలో ఐసీడీఎస్ ప్రథమ బహుమతి, వ్యవసాయ శాఖ ద్వితీయ బహుమతి, పౌరసరఫరాలు తృతీయ బహుమతి కైవసం చేసుకున్నాయి. వివిధ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ ఫర్మాన్ మహమ్మద్, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధులు సాధించిన స్వేచ్ఛను ప్రస్తుత యువత సద్వినియోగం చేసుకొని దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)



స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కిష్టప్పపేటలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సచివాలయంలో సర్పంచ్ సత్యవతి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటిచెప్పాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమే ఈ స్వాతంత్ర్యమని, స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటి చెప్పాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి జోనల్ చైర్మన్ కరణం శోభారాణి అన్నారు. గాంధీనగర్‌లోని హారికా కన్‌స్ట్రక్షన్స్ భవనం వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. కరణం హారిక మాట్లాడుతూ యువత ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాలు, సంపాదన కోసం ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారని, మన విజ్ఞానాన్ని భారతదేశ అభివృద్ధికి వినియోగించిననాడే నిజమైన దేశభక్తికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్, అధ్యక్షులు వావిలాపల్లి జగన్నాధంనాయుడులు మాట్లాడుతూ సమాజాభివృద్ధే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి సంస్థ మూడేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు తోడ్పాటును అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మణిశర్మ, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, నిహార్‌నాయుడు, ఉషారాణి, సుమన్, లక్ష్మణరావు, ఆకుల కృష్ణ, కాలనీవాసులు ఐ.జగన్నాధరావు, తంగుడు గోవింద, పాల్ దేవదాస్, వడ్డి గణపతి, పాల్ జయరాజ్, అంపోలు చంద్రరావు, హారికా కన్‌స్ట్రక్షన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులు అత్యున్నత స్థాయికి చేరాలి



(సత్యంన్యూస్, పొందూరు)

ప్రతి విద్యార్థి హక్కులతో పాటు ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత స్థాయికి చేరాలని తెలుగుదేశం పార్టీ జిల్లా తెలుగు యువత కార్యదర్శి లోలుగు వెంకట్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా లోలుగు హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పాఠశాలల్లో 500 పైబడి మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతిని, రెండు వాలీబాల్స్, ఒక నెట్ స్కూల్ పీడీకి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బలగ శాఖా గ్రంధాలయంలో..

గురువారం 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు గ్రంథాలయ అధికారి పి. ఉగ్రసేను ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది మొదటగా వార్డు ఇంచార్జ్ రొక్కం భాస్కర రావు గారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా జాతీయ నాయకుల జీవిత చరిత్రలను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది ప్రతి ఒక్కరూ జాతి సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలని మన భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా చేర్చవలసిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వినోద్ గారు సహాయకురాలు కె. అనిత పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు



## ఇండియన్ రెడ్‌క్రాస్‌లో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. రెడ్‌క్రాస్ ఆవరణలో జెండా ఆవిష్కరణ అనంతరం చైర్మన్ పి.జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ త్యాగమూర్తుల కష్టార్జితం వల్ల స్వాతంత్రం లభించిందని, మన మంతా త్యాగధనుల వారసులమని, వారిని కచ్చితంగా స్మరించుకోవలసిన అవసరముందన్నారు. ట్రెజరర్ కె.దుర్గాశ్రీనివాస్, సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, వైకుంఠరావు, నిక్కు హరిసత్యనారాయణ, కళ్యాణ్‌లు ప్రసంగించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆడిటర్ వీఎం రావులను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో బి.సతీష్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.




## స్వాతంత్ర్య స్ఫూర్తితో మెలగాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

బ్రిటీష్ పాలన నుంచి భారతావనికి విముక్తి కలిగించేందుకు ఎందరో మహనీయులు త్యాగాలు చేశారని, వారి స్ఫూర్తితో నేటి యువత, విద్యార్థులు మెలగాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా అన్నారు. పెద్దరెల్లివీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీ చైర్మన్ అరుగుల భాస్కరరావుతో కలసి గంజి ఆర్ ఎజ్రా జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గురుగుబిల్లి వెంకటరావు, ఇందువ సంగంనాయుడు, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పిన్నింటి అప్పన్న, కార్యవర్గ సభ్యులు కె.ఎన్.మూర్తి, అరుగుల కుమార్, నందేష్, పడాల కృష్ణారావు(బాల), గణపతి, బమ్మిడి వేణుగోపాల్, ఆకుల మాధవ, తిర్లంగి రామకృష్ణ, ఆర్.ప్రసాదరావు, ఆకుల కృష్ణ, చంద్రమోహన్, బలగ మోహన్, బాలకృష్ణ, నాయకులు జలగడుల జగన్, అర్జి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీ కార్యాలయంలో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



భారతీయ జనతాపార్టీ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరావు, బీన వంశీ, పూడి బాలాదిత్య, పి.సూర్యకుమారి, పొన్నాడ సంజీవరావు, కోరాడ అప్పలరాజు, పూజారి చల్లయ్య, చిట్టి తవుడు, బి.రాజేశ్వరి, వి.ఉమామహేశ్వరరావు, డివిఎస్ఎన్ సోమేషన్, సరళ, భైరి అప్పారావు, వావిలపల్లి చంద్రరావు, లోలుగు సింహాచలం, రామారావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పీఎస్ఎన్ మున్సిపల్ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలివాడ భాస్కరరావు అధ్యక్షతన గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ పల్లా జయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను ప్రధానోపాధ్యాయులు బి.భాస్కరరావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా మార్చి 2024లో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులు సింగూరు జోష్న, బి.వి.నారాయణాచార్యులు, జి.సాహిత్య, జి.సాయిసాగర్, ఏ.శ్యామ్ స్వరూప్‌లకు, పాఠశాలలో 6,7,8,9 తరగతులు చదువుతున్న టాపర్స్ త్రిలోచన్, యోగేశ్వర్, భార్గవ్ కృష్ణ, కె.ప్రణీత్, ఎం.సూర్య, జగన్ తదితరులకు దాతలు పెంకి సావిత్రమ్మ, పి.సృజన్, పి.ఇందిరామణి, కె.విద్యాసాగర్, ఏ.దక్షిణామూర్తి, కోరాడ వైకుంఠరావు, చోడవరపు రాధాకృష్ణ, సిహెచ్‌వి రాధాకృష్ణ వేణి, పోలవరపు జీవరత్నం, చౌదరి మణెమ్మ, చంద్రభూషణ శతపతి, ఎన్నారై రాయలు అందజేసిన నగదు ప్రోత్సాహక బహుమతులను పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు పైడి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పలు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు చైర్‌పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ప్రియాంక చేతుల మీదగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎస్.శంకరరావు, పి.భాగ్యలక్ష్మి, టి.శ్రీపూర్ణిమ, పి.రమణకుమారి, కె.చంద్రకళ, ఈరంకి గౌరి, సీహెచ్ విజయశ్రీ, పాఠశాల సిబ్బంది పి.రమణమ్మ, సుప్రియ, లక్ష్మి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో..



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

నగరంలోని స్థానిక 31 డివిజన్‌లోని దండి సూర్యనారాయణ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో గురువారం స్వాతంత్య దినోత్సవ వేడుకలు ఘనంగా స్కూల్ యాజమాన్యం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ డివిజన్ ఇన్‌ఛార్జి విబూది సూరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం పెద్దలు ఎన్నో త్యాగాలను చేసి ప్రాణాలను అర్పించారని, నేడు మనమంతా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో ఉన్నామని, వారిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని తెలిపారు. కార్యక్రమం అనంతరం సూరిబాబు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, స్థానిక నాయకులు పేట పద్మ, కటారి శ్రీదేవి, సరళ, దండి రాజేంద్రదేవ్, ఎస్.శ్రీనివాసరావు, సీఎల్‌పీ అరుణ, పేరెంట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.దివ్య, వైస్ చైర్ పర్సన్ దేవీ, వాణి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

## అల్లూరి ఏకపాత్రాభినయం

(సత్యంన్యూస్, పాలకొండ)

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పాలకొండ కోట దుర్గమ్మ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీకృష్ణ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా సేవా కిరణ్ సంస్థ ఆధ్వర్యంలో చింతాడ అనంతాచారిచే అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ఏర్పాటు చేశారు. స్వాతంత్ర స్ఫూర్తిని నింపేలా అల్లూరి సీతారామరాజు జీవితంలోని కొన్ని ఘట్టాలను అనంతాచారి ప్రదర్శించారు. అనంతరం మిఠాయి పంపకం జరిగింది.



## వెలమ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించండి

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

రాష్ట్రంలో 50 లక్షల జనాభా కలిగిన వెలమ సామాజిక వర్గానికి విశాఖలో ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘానికి విశాఖపట్నంలో రెండు ఎకరాల స్థలం కేటాయించాలని రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు కోరారు. విశాఖపట్నం నగరానికి వచ్చిన మంత్రిని ఒక హోటల్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సామాజిక వర్గాలకు, వివిధ సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు విశాఖలో స్థలాలు కేటాయించారని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘానికి కూడా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్డి సత్యం, వైస్ ప్రెసిడెంట్ వరుదు రాజ్‌కుమార్, విశాఖ ఇన్‌ఛార్జి రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలలో..

(సత్యంన్యూస్ శ్రీకాకుళం)

హయాతినగరంలోని మహాత్మ జ్యోతిభా పూలే వెనుకబడిన తరగతుల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు స్వాతంత్ర్య విశిష్టతను వివరించారు. వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ ఆకాశ్ కెరీర్‌లో..



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని శాంతమ్మ కాలనీలో ఉన్న శ్రీ ఆకాశ్ కెరీర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు సీహెచ్ వెంకట్ ఆధ్వర్యంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం వెంకట్ మాట్లాడుతూ ఆకాశ్ కెరీర్స్ కోచింగ్ పొందిన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొంది దేశసేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. స్వేచ్ఛగా జీవించగలమన్న కాంక్షతో బ్రిటిష్ వారిని ఎదిరించి ఎందరో మహానుభావుల ప్రాణత్యాగం చేసిన ఫలింగానే స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ప్రతిఒక్కరూ స్వాతంత్ర్య చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వాయుసేన విశ్రాంత ఉద్యోగి ఎస్‌జీటీ వెంకటరమణ, త్రివిధ దళాల విశ్రాంత ఉద్యోగులు వెంకట రమణ, జగదీశ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## 11 మందికి ఉద్యోగోన్నతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ అర్హత సాధించిన ఉద్యోగులకు సీనియర్ సహాయకులు నుంచి ఏవోగా, 10 మంది ఆఫీసు సబార్డినేట్లకు రికార్డు సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు మిఠాయి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్, సి–సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

- ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీను

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం సిద్ధించిందని ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అంపోలు సబ్‌జైలు, పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న నివాసంలో గురువారం జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భావనతో ప్రతిఒక్కరూ మెలిగి దేశభక్తిని పెంపొందించుకొని, స్వేచ్ఛ స్వతంత్రాలను అందించిన సమరయోధులను గుర్తుచేసుకొని వారు సూచించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. అనంతరం చౌదరి సత్యనారాయణ కాలనీ వద్ద మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ట్రస్టు ప్రతినిధులు సూర శ్రీనివాసరావును ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జైలర్ మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.



## తెలుగు బాప్టిస్ట్ చర్చిలో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో గురువారం సంఘ ప్రెసిడెంట్ ఎం.ఆనంద రత్నకుమార్ ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగ ఫలమే నేటి స్వతంత్రమని అన్నారు. కార్యక్రమంలో సంఘ కాపరి, చింతవలస అనుబంధ సంఘ కాపరులు రెవరెండ్ ఆర్ అశోక్‌కుమార్, జి.కిరణ్ వాక్య సందేశం అందించగా సంఘకాపరులు దేశం కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సీనియర్ సిటిజన్స్, సంఘ విశ్వాసులు సుమారు 80 మంది పాల్గొన్నారు.





78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నందిగాం ప్రాంతీయ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాను జిల్లా పార్లమెంటరీ పార్టీ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మాజీ జెడ్పీటీసీ కురమాన బాలకృష్ణారావు, ప్రత్యేక ఆహ్వానితుల చిన్ని జోగారావు, మండల పార్టీ అధ్యక్షులు తమిరే ఫల్గుణరావు, ఎంపీటీసీలు లవునిపల్లి ధనరాజు, అంబోడి విష్ణు, సైలాడ లవన్న, సర్పంచులు జద్యాడ జయరాం, తమిరె రాజు, తమిరె దేవేంద్రరావు, నాయకులు పేరాడ రమేష్, లోల్ల వైకుంఠరావు, బెండి బాబూరావు, కురమాన ఉత్తమ్‌కుమార్, అక్కురాడ లోకనాథం, పిన్నింటి అజిత్, కొప్పల ధనుష్, మెట్ట రమేష్, ప్రగడ ప్రభాకరరావు, ప్రగడ ఈశ్వరరావు, ప్రగడ ఖగేశ్వరరావు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, టెక్కలి

## శర్వాణిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి రోడ్డులోని 'శర్వాణి విద్యాలయలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంస్థ అధినేత అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి సురంగి మోహనరావు పతాకావిష్కరణ చేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత అంధవరపు సూరిబాబు, హెడ్మిస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను వివరించారు. ఇస్కాన్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ హర్షవల్లికి అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి అందించిన ఉత్తమ సామాజిక సేవలకు గాను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా గురువారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డును అందుకున్నారు. వేడుకలలో అందుకున్నారు. శ్రీకాకుళం లయన్స్ క్లబ్ హర్షవల్లిక్లబ్ మొత్తానికి అవార్డు రావడం గర్వకారణంగా ఉందని, ఈ అవార్డు అందరి కృషితోనే ఇది సాధ్యమైందని లయన్స్ హర్షవల్లి వ్యవస్థాపకులు హారిక ప్రసాద్ అన్నారు.



## ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శం నరసింహమూర్తి

(సత్యంన్యూస్, టెక్కలి)

ఉపాధ్యాయ వృత్తికే ప్రధానోపాధ్యాయులు దివంగత మణిపాత్రుని నరసింహమూర్తి ఆదర్శమని సంతబొమ్మాళి మండలం బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామకృష్ణ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో పాఠశాల వ్యవస్థాపకులు మాజీ హెచ్ఎం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత మణిపాత్రుని నరసింహమూర్తి విగ్రహావిష్కరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాలకు రహదారులు గరీబుల గెడ్డ వంతెన బీసీ హాస్టల్ ఆయన కృషి వల్ల కృషి వల్లే మంజూరు అయ్యాయన్నారు. ఆయన గుర్తింపుగా ప్రతి ఏడాది టెన్త్ క్లాస్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ.5వేలు, ద్వితీయ స్థానం రూ.3వేలు, తృతీయ స్థానం రూ.2వేలు ప్రతిభా పురస్కారాలు ఇవ్వనునట్లు ఆయన మనవడు, జాతీయ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి జేఎన్‌టీయూ విజయనగరం సిండికేట్ మెంబర్ డాక్టర్ రాజేష్ ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం, లక్ష్మయ్య, ఎంపీటీసీ చింతాడ జయ చిన్నారావు, గ్రామపెద్దలు చింతాడ దిలీప్ కుమార్, వజ్జ ప్రభాకర్, అప్పిని వెంకటేష్, ముద్దపు రమణమూర్తి, వల్లభ వసంతరావు, ఆరంగి రామారావు, కుటుంబ సభ్యులు, పూర్వ విద్యార్థులు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## మానవత్వంతో సేవలందించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ప్రభుత్వ సర్వజనాసుప్రతికి వచ్చే రోగులకు మానవత్వంతో సేవలు అందించడమే నిజమైన దేశభక్తి అని వక్తలు పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రిమ్స్ ఆవరణలో జాతీయ జెండాను సూపరింటెండెంట్ షకీలా ఎగురవేశారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన స్టాఫ్‌నర్సులకు పురస్కారాలను అందజేశారు. 23 ఏళ్ల పాటు స్టాఫ్‌నర్స్‌గా తన సర్వీసులో ఎక్కడా చిన్న వివాదం లేకుండా విధులు నిర్వహించిన అమ్ము సత్యవాణికి స్వాతంత్ర్య దినోత్సవ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న కుమార్‌తో పాటు గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్లు, సిబ్బంది ఉన్నారు.






## పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

(సత్యంన్యూస్, పొందూరు)

తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 14 మంది విద్యార్థులకు వసుదైక కుటుంబం ఫౌండేషన్ పంపిన సైకిళ్లను సర్పంచి తమ్మినైన మణెమ్మ, యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ తమ్మినైన అమ్మాజీ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. వసుదైక కుటుంబం ఫౌండేషన్ గతంలో కూడా తల్లి, తండ్రి లేదా తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, సమన్వయకర్త పూజారి హరిప్రసన్న తెలిపారు. ఇదే పాఠశాలలో చదువుతున్న మరికొంత మంది విద్యార్థులకు స్కాలర్షిప్పులు కూడా ప్రతీ నెలా అందజేస్తున్నారని వారు తెలిపారు.

## విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఠాగూర్ స్కూల్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ సాలిహుందం రవికుమార్. కరెస్పాండెంట్ పి.సత్తిబాబు, ప్రిన్సిపాల్ బెహరా శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, హైస్కూల్ ఇన్‌ఛార్జి సీతారాం, రాజేశ్వరి, రమాశైలజ, చందు, రోజా, గుణప్రియ, దీపిక, లక్ష్మి, సంతోష్. సునీతా తదితరులు పాల్గొన్నారు



## జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

దండివీధిలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కేంద్ర కార్యాలయ ఆవరణలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.వరప్రసాద్ జాతీయ పతాకాన్ని ఎగరవేసి స్వతంత్ర దినోత్సవ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్.జగదీష్, డీజీఎంలు సీహెచ్ బసవలింగం, శిల్లా రమేష్, ఏటీఎంలు జి.రామ కృష్ణరావు, బి.దశరథరామ్, ఆర్కే భాస్కరరావు, జిల్లాలోని 25 బ్రాంచ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.